# మధ్యవర్తి మహిమ

**కథానిక**

రామచంద్రం, టేబిలుముందున్న కుర్చీలో కూచుని గెడ్డంకింద చేతులు ఆనించి ఎదురుగుండావున్న కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. ఆనాడు కాలేజీకి సెలవు. తను చెయ్యవలసిన పని ఏమీలేదు. అయినా, ఆలోచనల్లో తేలిపోతున్నాడు. ఎదురుగా వినయవిహార్, వివేకవిన్యాస, సద్ధర్మసాధన-అశోకవర్ధన— మరోమూలగావున్న షెడ్స్, అవుపిస్తున్నాయ్. ఒంటిగంట సమయం. హోస్టలు రేడియో పాడుతూంది. లౌడ్‌స్పీకర్లు శబ్దాన్ని నలుమూలలా మోసుకుపోతున్నాయ్. సముద్రంమీంచి చల్లనిగాలివచ్చి రామచంద్రానికి ఏదో సందేశాన్నిస్తున్నట్టుంది,

సుదర్శనం వచ్చి "కాఫీ తాగొద్దాంరా" అన్నాడు.

"తాగేవచ్చాను" అన్నాడు రామచంద్రం ముక్తసరిగా.

"ఏదో ఆలోచనల్లోపడినట్లుంది?" అడిగేడు సుదర్శనం.

జవాబివ్వలేదు రామచంద్రం.

"సరే నేవెళ్ళొస్తా"నని వెళ్ళిపోయాడు సుదర్శనం.

ఎంతసేపు ఆలోచించినా ఓ ఒడ్డుకి చేరుకోలేకపోతున్నాడు రామచంద్రం.

"ఆ అమ్మాయిని ఎల్లాగన్నా పెళ్లి చేసుకోవాలి"

"ఎలా?"తనలో తనే ప్రశ్నించుకున్నాడు.

"వాళ్లు మనదగ్గరికి రాందే, మనం మళ్ళీ యే మొహంపెట్టుకు వెళతాం?"తండ్రి మాటలు ప్రతిధ్వనించాయ్

"ఒకవేళ వాళ్ళుమరి రాకపోతే?" సందేహం కలిగింది.

"ఆఁ...రాకేంచేస్తారు. మనకంటే మరోడెవడైనా వాళ్ళకి దొరికితేకదూ—?" సమాధానపరచుకున్నాడు మళ్ళీ.

"అబ్బెబ్బె! అది అబద్ధం. లోకంలో నేనొకణ్ణేలేను. ఎంతమందో వున్నారు పెళ్ళికొడుకులు. వాళ్ళకి దొరక్కపోరు. నిశ్చయానికొచ్చాడు:

"అసలు యింతకీ—విముఖత్వం యేర్పడడానికి గల కారణం అంత గొప్పదికాదే!"అనుకున్నాడు తనలో.

ఆ రవణయ్యపంతులు మధ్యవర్తిగావుండడం, వచ్చింది చిక్కు. లేకపోతే ఆ గోపాలరావుగారు తిరస్కరించేవారే కారు.

ఒకనాడిమాట—

## 2

బజార్లో కనబడి రవణయ్యపంతులుని తనింటికి తీసుకువెళ్ళాడు గోపాలరావు. ఆ యిద్దరికీ చిన్నప్పటినుండీ పరిచయం. ఆ తర్వాత—ఇప్పటిదాకా, అంటే పన్నెండు సంవత్సరాలదాకా ఇద్దరూ కల్సుకోలేదు. ఎవరిఖర్మాన వారు వాళ్ల కడుపు నింపుకోవడంకోసం వెళ్ళిపోయారు. యిద్దరూ యేమంత చదువుకున్నవాళ్ళు కాదు. అయినా గోపాలంగారు మంచి వ్యవహారస్థుడు. కాస్త సంస్కారి కూడాను.

పంకజమ్మతో చెప్పాడు గోపాలం— "మన రవణయ్యపంతులు మనకి చాలా సహాయం చేస్తాడీవిషయంలో."

"ఏదైనా—పంతులు మొదటినుండీ మనమీద యెంతో అభిమానంగా వుంటున్నారు. యింతకీ యెవరికి మాటదక్కే యోగంవుందో..."

"మనకి దేవుళ్లా ఎదురుగాపడ్డాడంటే నమ్ము. అసలు, ఇంతకీ మన సరోజిని అదృష్టవంతురాలు" క్లుప్తంగా తేల్చేశాడు గోపాలం.

పెరట్లోనుండి వచ్చిన ముసలమ్మ అన్నది: "మా తల్లికి మంచి మొగుణ్ణిచూసిపెట్టునాయనా

పి. వి. పల్లి

చచ్చి నీకడుపున పుడతాను. అంతకన్న నీకు నేను చెయ్యవలసిన సహాయం మరోటి లేదు."

రవణయ్యపంతులు ఓ బెత్తెడు పెరిగినట్టయాడు. పైపెదవిని పండ్లతో నొక్కుతూ మంచి పోజు పెట్టి అన్నాడు; "అయినా, నాలో యేముందండి. యింతకీ మీ అమ్మాయి అదృష్టవంతురాలు—" ఆగి, దీర్ఘంగా వీధిలోకి చూచి, మళ్ళీ తలతిప్పి అన్నాడు: "మనకి అట్టే శ్రమక్కర లేదు. చేతిలో నేవున్నది సంబంధం." సిగరెట్టు దమ్ము గట్టిగా లాగేడు.

"అయితే మరే—ఎవరు వాళ్ళు?" ఆత్రుతగా అడిగేడు గోపాలంపంతులు.

"మాకు వేలువిడిచిన పినతండ్రికొడుకున్నాడు. వాల్తేరులో చదువుతున్నాడు. బి. యస్. సి. అనుకుంటాను." కాస్సేపు ఆగాడు. ఆలోచిస్తున్నట్లు నటించి—మళ్ళీ అన్నాడు:

"వాళ్లు మనం ఎలా చెపితే అలా వినే రకం. ఓ నాడు మా పినతల్లి అన్నది కూడా "మా చంద్రానికి యెక్కడైనా సంబంధం చూడమని."

"సరే. వాళ్ళ వూరెప్పుడు వెళదాం?" అడిగాడు పంతులు.

"ఎల్లుండి దశమి-మంచిదినాయనా!" అన్నది ముసలమ్మ.

ఆవిడ నడివయస్సులో వున్నప్పుడు, ముహూర్తాలు చెప్పి కానీ పరకా గడించేది. అందుకే పంచాంగం చూడకుండా తక్కున చెప్పగలిగింది ముహూర్తం.

"శ్రవణం నక్షత్రం కూడాను" అన్నది మళ్ళీ.

* * *

ఇద్దరూ—రవణయ్యపంతులూ, గోపాలరావు గారూ—గుమ్మంయెక్కగానే ఎంతో మర్యాద చేశాడు సుందర్రామయ్య. రాధమ్మ గ్రహించింది వీళ్ళ రాకలోని ఆంతర్యాన్ని. ఒక్కడే కొడుకు—పెళ్ళి ఘనంగా చెయ్యాలని పట్టుదల. బాగా కట్నం కానుకలూ, మర్యాదలూ పొరదాలని ఆవిడ అభిలాష.

పదిగంటలకి వెళ్ళారు పెళ్ళివారు. వెంటనే భోజనాలు యేర్పాటయినాయి. తరవాత సావిట్లో కూచుని సమావేశోద్దేశాన్ని బయటపెట్టాడు రవణయ్యపంతులు. సుందర్రామయ్య లోలోన సంతసించాడు. బయటికిమాత్రం గంభీరంగావున్నాడు.

"మీ వుద్దేశం తెలియచెయ్యండి" అన్నాడు గోపాలం.

"మీరు యీ విషయంలో వెనకదియ్యకూడదు కక్కి. మన లాంఛనాలకి లోటువుండదు." చెయ్యి ఆడిస్తూ అన్నాడు రవణయ్య.

"ఆఁ... వాటికేముంది? యింతకీ మా చంద్రం పిల్లని చూచుకోవాలిగా—"

"చూచుకోడూ మనకాలమనుకున్నా రేంటి?" కాస్సేపాగి.

"పోనీ చూచుకున్నాక నచ్చేదనే అనుకుందాం" అన్నాడు రవణయ్య.

"మీ కోరికయేదో సెలవియ్యండి" సవినయంగా అన్నాడు గోపాలం.

"మావాడికి, వాళ్ళ మేనమామ, రెండువేలు కట్నం, రిస్టువాచీ రాలీసైకిలు యిస్తానన్నాడు" అన్నది రాధమ్మ.

"అవున్నాయనా నేను బతికుండగా వాడి నెత్తిన యిన్ని అక్షింతగింజలు పడితే చూచి చచ్చిపోదామని వుంది." అన్నది ముసలమ్మ దగ్గుతూ. ఆవిడ సుందర్రామయ్యతల్లి.

"యీ విషయంలో మీరు ఆలోచించ కూడదు" అన్నాడు రవణయ్య, గోపాలంకేసి చూస్తూ.

గోపాలం నిశ్చేష్టుడైపోయాడు. తను అనుకున్నది వెయ్యరూపాయిలకన్న యెక్కువ యివ్వలేనని, మరో రెండువేల రూపాయిలదాకా వున్నది వీళ్ళఆశ. ఆపైనయింకే యితర లాంఛనాలు తరవాత పెళ్ళిఖర్చులు. తన ఆస్థి అంతా అమ్మినాచాలదు.

"ఆలోచించి చెపుతాను" అన్నాడు గోపాలం.

"ఆలోచనెందుకయ్యా. యీ అమావాస్య వెళ్ళగానే మావాడు వస్తాడు. పిల్లని చూచుకుంటాడు." అన్నాడు రవణయ్యపంతులు మొగపెళ్ళి వారి హోదాలో.

"సరే కానివ్వండి ఆతర్వాత ఆలోచిద్దాం" అన్నాడు గట్టిగా ఊపిరితీసి వొదుల్తూ గోపాలం.

"సుందరంబాబయ్యా, మీరు తండ్రికొడుకులు యిద్దరూ, నేనూ, మా కిష్టగాడూ వెళదాం." అన్నాడు రవణయ్య.

"నేను కాదన్నానా?" అన్నాడు సుందర్రామయ్య.

రామచంద్రం, ప్రభృతులు పెళ్ళిమాపులకి వెళ్ళారు. పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ఒకర్నొకరు చూసుకోడాలయ్యాయి.

రామచంద్రం తృప్తిపడ్డాడు, తను ఆశించినంతవరకు కృతకృత్యుడు కాగలిగాడు. సరోజిని నిరక్షరాస్యకాదు. ఫోర్తుఫారం దాటింతర్వాత మానేసింది. సంగీతంవచ్చును. లేసుపని పూర్తిగా తెల్సు. తాను అనుకున్నట్లు, యీమె తనకి ఆకర్షణీయంగా కనిపించింది.

కాఫీ ఫలహారాలయ్యాక, షికారుగా రవణయ్యపంతులూ తనూ వూళ్ళోకి పయనమయ్యారు. ప్రతి కాఫీహోటల్లోనూ దూరి అర్థరూపాయికి తక్కువగాకుండా బిల్లుచెల్లించి బయట పడేవాడు రవణయ్య. అయితే ఆ బిల్లు రామచంద్రమే చెల్లించేవాడు. ఆసాయంత్రం మెయిల్లో సుందర్రామయ్యగారూ, కిష్టిగాడూ (నాలుగో బ్రాహ్మడుగా తీసుకురాబడ్డాడు) మద్రాసు, యేదో పనిమీద వెళ్ళిపోయాడు.

రాత్రి ఎనిమిదింటికి చేరుకున్నారు యింటికి రామచంద్రమూ, రవణయ్యపంతులూను. రెండు సార్లు వచ్చిన వాడవడంవల్ల పూర్తిగా చనువు యేర్పడింది వీళ్ళయింట్లో. గబగబా వంటయింట్లోకి వెళ్ళి "పంకజమ్మగారూ ఆకలిగాలేదు. యీరాత్రి కాసిన్ని పాలుతాగి పడుకుంటాను" అన్నాడు,

"అదేమిటి యేంతిన్నారు గనక? వేడిచేస్తుంది కాస్తంత అన్నం, యింతమజ్జిగ వేసుకుని తినునాయినా!"అన్నది ముసలమ్మ.

"అవునుఅలా గేచెయ్యండి"అన్నది పంకజమ్మ.

"మీమాట తోసెయ్యడం నాకు చేతకాని పని" అంటూ యివతల కొచ్చేశాడు.

రామచంద్రం, గోపాలంగారు, రవణయ్య పంతులు వరసగా కూచున్నారు. పంకజమ్మ వడ్డిస్తోంది. అందరికీ మామూలుగానే వడ్డించింది. రవణయ్యపంతులు మాటాడలేదు. పదార్థాలు మంచి రుచిగావున్నాయి కాబోలు మిగత యిద్దరికన్నా, తనే ఫస్టుప్రెయిజు కొట్టేశాడు. రామచంద్రం నవ్వుకున్నాడు. పంకజమ్మ నిర్ఘాంతపోయింది.

"ఈ రాత్రి ట్రెయినులో వెళ్ళిపోతున్నాం" అన్నాడురవణయ్యపంతులు, మజ్జిగకలుపుకుంటూ.

"ఆఁ...యీ రాత్రి వెళ్ళడమేం? పొద్దున్న మెయిల్లో వెళుదురుగాని"అన్నాడు గోపాలం.

"అదికాదు రేపు నాకు చాలాపనుంది వెళ్ళక తప్పదు" అన్నాడు రవణయ్య నోటికి పోనిస్తూ.

"ఏమిటో ఆపని?" అన్నట్టు చూశాడు రామచంద్రం.

"ఏంపని?" అడిగాడు గోపాలం.

"డిష్ట్రిక్టుకలక్టరు మావూళ్ళో క్యాంపు!" విస్తరి వూడుస్తూ త్రేవుమని త్రేన్చి అన్నాడు.

"ఆఁ...ఫర్వాలేదు లేవోయ్" అన్నాడు గోపాలం.

"మరి మీరు మొహమాట పెట్టకండి" అన్నాడు మరచెంబుడు నీళ్ళూ గటగటాతాగి.

రామచంద్రానికి వుండిపోదామనే వున్నది. ఎందుకో తనకే తెలీలేదు.

"ఫర్వాలేదు" అందామనుకున్నాడు. అయినా, మర్యాదగా వుండదని వూరుకున్నాడు. అసలు, గోపాలంగారు వెళ్ళనివ్వడనిగ్రహించాడు.

రాత్రి, సావిట్లో రవణయ్యపంతులుకీ, రామచంద్రానికీ పక్కలు వేశారు. పిచ్చీపాటీ అయింతర్వాత నడుం వాల్చారిద్దరూ.

రామచంద్రం ఎవేవో ఆలోచనల్లో పడ్డాడు. గడియారం తిరుగుతూనేవున్నది. రవణయ్యపంతులు పెడుతున్న గురక చాలా చికాకుగా వుంది. ఆలోచనాలకి అంతరాయం కలిగిస్తోంది. ఆతనిమీద కోపంవచ్చింది రామచంద్రానికి, అప్పుడే పదిగంటలు దాటేయోలేదో మొద్దునిద్ర. విసుక్కున్నాడు. అయినా మనస్సుని ధృడం చేసుకుని ఆలోచించడం మొదలు పెట్టేడు. ప్రక్కగదిలోనుండి యేవేవో మాటలు వినిపిస్తున్నాయ్.

"అవునుగాని యింతకట్నం మనం యివ్వగలమా?" గోపాలంగారి గొంతుక,

"పోనీ వేయ్యిరూపాయిలయితే యివ్వగలం" పంకజమ్మగొంతుక.

అసలు మన సరోజిని యిష్టపడిందా?" అడిగేడు గోపాలం.

"అది యిష్టపడే వుంటుంది యేమే సరూ యేమిటంటావ్..." అడిగింది పంకజమ్మ

మౌనందాల్చింది సరోజిని. సిగ్గుతో చెప్పలేక పోయింది.

"పోనీ నేవెళ్ళిపోతాలే" గోపాలం వెళిపోయిన చప్పుడు.

"ఏమంటావు సరూ. నీకిష్టం లేకపోతే మేం చెయ్యం." అడిగింది మళ్ళీ పంకజమ్మ.

"నాకిష్టమే" అన్నది నసుగుతూ, సరోజిని.

రామచంద్రం, అత్యున్నత శిఖరాలని అందుకున్నట్టు, ఫీలయ్యాడు. ఏదో పట్టరాని సంతోషంతో మనస్సు ఉప్పొంగిపోయింది. ఒక్కసారి గట్టిగా వూపిరి తీశాడు. మళ్ళీ వినబడుతున్నాయి మాటలు.

"అమ్మా" వూరుకుంది సరోజిని.

"ఏమిటే నీ సందేహం?"

"అంత..."

"చెప్పవే..."

"కట్నం మనం యివ్వగలమా?" తన సంశయాన్ని వెలిబుచ్చి కట్నంమీద కోపంవచ్చింది రామచంద్రానికి. తను దమ్మిడీ కట్నం కూడా పుచ్చుకోనని చెప్పేదమనుకున్నాడు.

"ఆ వూసు నీకెందుకు? నువ్వు యిష్టపడితే అంతేచాలు" అన్నది పంకజమ్మ.

సంతృప్తికలిగింది రామచంద్రానికి.

"ఇంతకీ" ఆగింది సరోజిని.

"ఇంతకీ?"

"అతను?"

"ఇష్టపడ్డాడో లేదో అనేనా నీ సందేహం."

"ఆఁ..."

"మన రవణయ్యగారిని అడుగుతాం."

గోపాలం లోపలికివచ్చాడు.

"రవణయ్య పంతుల్ని అడగండీ-అబ్బాయి యిష్టపడ్డాడో లేదో" అన్నది పంకజమ్మ.

"ఎంతయింది యిప్పుడు?" అంటూ పది దాటిందికాబోలు" అని సమాధానపడ్డాడు.

"నేను యిష్టపడ్డాను" అని చెప్పేద్దామనుకున్నాడు వెళ్ళి. కాని వూరుకున్నాడు. తనకు సిగ్గేసింది. రోజూ తరగతి అమ్మాయిలతో మాట్లాడుతున్నా, ఇప్పుడెందుకో ఆ మాట చెప్పడానికే సిగ్గేసింది.

"రవణయ్యగారూ."

"రవణయ్యగారూ!" పిలిచాడు గోపాలం.

"వెధవనిద్ర — మొద్దునిద్ర. మేలుకునివుంటే వీడి కొంపేం మునిగిపోయింది. విసుక్కున్నాడు రామచంద్రం. ముసుగులోంచి చూస్తున్నాడు. బ్లూలైట్ వెలుగులోంచి, గోపాలంగారు రవణయ్యని లేపుతున్నట్లు గమనించాడు.

రవణయ్యపంతులు లేచి వెళ్లాడు.

వాళ్ళ మాటలు తనకి వినపడలేదు. కోపం వచ్చింది రామచంద్రానికి. ఇందాక వాళ్లు మాట్లాడుకున్నట్లు ఎందుకు మాట్లాడుకోరాదూ? సరే, యేదో తేలిపోతుంది. ఇంతకీ తనూ, ఆ పిల్లా యిష్టపడ్డారు. తృప్తిపడ్డాడు.

రవణయ్యపంతులు ముసుగు తొలగించాడు. రామచంద్రం నిద్రనుండి లేచినట్లు కళ్లు నులుపుకుంటూ లేచికూచున్నాడు.

"నీ వుద్దేశమేమిట్రా?" అడిగేడు రవణయ్య పంతులు. కాస్త టెక్కు చేసినట్లు నటించాడు.

"చెప్పవోయ్" మళ్ళీ అన్నాడు.

"వాళ్ళేమన్నారు?" ప్రశ్నించాడు రామచంద్రం.

"నీ వుద్దేశం చెప్పవోయ్."

"నేను కాదనడం లేదుగా" అన్నాడు నవ్వుతూ.

"వూరుకో బయటికి అనకు. మనం కాస్త బెట్టుసరిగా వుండాలి" వెళ్ళిపోయాడు రవణయ్య పంతులు.

"ఆ మాత్రం దానికి నన్ను యిప్పుడెందుకు కదగాలి వెధవ మధ్యవర్తిత్వం" గొణుక్కున్నాడు రామచంద్రం. నేరుగా వెళ్ళి చెప్పేస్తే బాగుండును అనుకున్నాడు మళ్ళీ.

ఉదయం మెయిలు యెక్కారిద్దరూ.

"ఏమోయ్, ఏంచెప్పావు?" అని అడిగాడు రామచంద్రం.

"ఉత్తరం రాస్తామని చెప్పాను" అన్నాడు సిగరెట్టు దమ్ములాగుతూ.

"అలా యెందుకు చెప్పావు? యదార్థం చెప్పలేకపోయావ్?"

"అదికాదోయ్ లాంఛనం. మనం టెక్కుగా వుండాలి. మగపెళ్ళివారంటే యేమనుకున్నావ్? మళ్లీ వాళ్లు మన కాళ్ళదగ్గరకొచ్చి బాబూ ఏమీ అన్నారుకారు" అని ప్రాధేయపడాలి. అప్పుడు మనం, "మా కోర్కెలు తీరుస్తే అభ్యంతరం లేదు" అనాలి తెలిసిందీ?" రీతిగా అన్నాడు రవణయ్యపంతులు.

"ఏడిసినట్లేవుంది. వాళ్ళకన్న మనంఎందులో గొప్పవాళ్ళం. అందరం సమానమే. ఆమాత్రం దానికి మనం టెక్కు చెలాయించడం మంచిది కాదు. మన యింట్లోకూడా ఆడపిల్ల వుంటే తెలుస్తుంది" అన్నాడు రామచంద్రం.

"అప్పుడు మనమూ అంతేనోయ్" అన్నాడు సిగరెట్టు ఆఖరిసారిగా పీల్చి కిటికీలోంచి బయటకు పారేస్తూ.

"నాకేం నచ్చడం లేదు. నేనే వుత్తరం రాస్తాను."

"ఛాఛా అంత పనీచేశావు గనక. మీ నాన్నకి కోపంవస్తుంది" అన్నాడు రవణయ్యపంతులు.

అయినా, రామచంద్రం నిబ్బరంగానే వున్నాడు. ఎలాగయినా తను సరోజినిని పెండ్లాడగలడు. తను వాల్తేరులోదిగిపోయాడు. రవణయ్యపంతులు విజయనగరంలో దిగి, తన గ్రామం వెళ్ళిపోయాడు.

* * *

రవణయ్యపంతులూ, సుందరామయ్యగారూ మళ్ళీ సమావేశమయ్యారు. అసలు రవణయ్యపంతులే అక్కడికొచ్చాడు.

"అయితే రవణయ్యా, సంబంధంమాట ఏం చేదాం?" అడిగేడు సుందరామయ్య.

"వాళ్లు రాందే-వాళ్లు వచ్చినట్లయితే అప్పుడు మనం మాట్లాడుకోవచ్చును."

"అదికాదోయ్-మనం యిష్టపడ్డామని వాళ్లకి తెలుసా?"

"అది, వాళ్లు స్వయంగావచ్చి మనని కనుక్కోవలసిన విషయం."

"పోనీ మనమే వుత్తరం రాద్దాం. అందుమీద వాళ్లు స్వయంగా వస్తే మనం అందరం మాట్లాడుకోవచ్చును."

"అదికాదండీ" ఎప్పుడు వాళ్ళు వస్తారా? ఎప్పుడు కబురుచేస్తారా?" అని ఎదురుచూడాలి వాళ్ళు, ఆఖరికి విసిగి మన గుమ్మంలో వాలాలి."

"అంత బాధపెట్టడం యెందుకూ—అంట."

"మొగపెళ్ళివారం కదటండీ-మనం అంత త్వరగా లొంగిపోగూడదు."

"ఎవరం గడిచి బతికాం నాయనా. మన వుద్దేశం చెప్పడం మనవిధి" అన్నది రాధమ్మ.

"ఏమైనా నా కిష్టంలేదు సుమండీ. ఆ తర్వాత మీ యిష్టం."

"అతనలా అంటూంటే మనకేమే ఎల్లాగైనా వ్యవహారం సాసాయింపు కావాలి" అన్నాడు సుందరామయ్య.

"ఆఁ...అలా వుండాలి. అంతగా కాకపోతే, మా స్వంత వ్యవహారాలున్నాయి. ఓసారి ఆ వూరెళతాను. అప్పుడు వాళ్ళ చెవులో పడేస్తా నీవార్త" అన్నాడు రవణయ్యపంతులు. అయితే సరే తృప్తిపడ్డాడు సుందరామయ్య.

* * *

"నువ్వు యేమో అనుకుంటున్నావుగాని బెట్టు సరిచేస్తే లాభంలేదు—"

"ఇప్పుడు యెవడు బెట్టుసరి చేశాడోయ్. వాళ్లు "అవును" అంటే మనం వెళ్ళగలంగాని, ముభావంగా వూరుకుంటే యెలా వెళ్ళగలం?"

"మరి, నువ్వువెళ్ళి అడగాలి మీకు యిష్టమేనా? అని"

"పోనీ వెళతామే అనుకో. తీరా వెళ్ళాక "మావాడు యిష్టపడలేదండీ" అంటే, మొహం తేలేసు రావలసిందేనా?"

"అవును అదీ నిజమే. మరి యిప్పటిదాకా రాయకపోతే యెలా? కాకపోయినా ఆడపిల్లగలవాడవు గనక ఒదిగి వుండాలి—"

"నే నెప్పుడూ ఒగిదివుండను. ఆడపిల్లని కలిగుంటే తప్పా. వాళ్ళ గుమ్మంలోకి మనం వెళ్ళడం వాళ్ళకాళ్ళు పట్టుకుని ప్రాధేయపడడం, వాళ్ళు యేవేవో హిరణ్యాక్షవరాలుకోరడం ఇవ్వకపోతే కౌన్సిలు చెయ్యటం నాకెంతమాత్రం యిష్టంలేదు. పిల్లకి పిల్లడూ, పిల్లడికి పిల్లా నచ్చడం కావాలి. ఆ తర్వాత మనం వెనక్కి తీసినా, వాళ్ళే ముందు కొస్తారు."

"ఆకాలం ఇంకా రాలేదోయ్. మన ఇండ్లల్లో పెరిగే పిల్లలు అంత పాటివాళ్లుకారు. అలాంటి వాతావరణం మనం యింకా సృష్టించలేదు."

"నువ్వు పొరబడుతున్నావు-ఆడది చదువుకుంటే, తనంత తనే తన జీవితాన్ని చక్కబరుచుకుంటుందోయ్. మనం నిమిత్తమాత్రులమే—"

"అవునోయ్. మనం వాళ్ళ యింటికి వెళ్ళకపోతే, ఎలాగయ్యా మనపిల్లకిష్టమయితే సరా—వాళ్ళు యిష్టపడ్డారో లేదో యెల్లా తెలుస్తుంది?"

"అందికే వాళ్ళు ఉత్తరం రాయడం దాని మీద మనం వెళ్ళడం సబబు, అంతేగాని పిలవని పేరంటంగా వెళ్ళడం నా కిష్టంలేదు. ప్రాధేయ పడడం నాచేతగాని పని."

"ఐతే నీయిష్టం. వాళ్లురారు—"

"ఐతే వాళ్ళకి ఇష్టంలేదన్న మాట."

"ఏమో మరి?"

"పోనీ-మరో సంబంధమవుతుంది. లేకపోతే లేకపోతుంది. కాని, ఆడపిల్లగలవాళ్లు వెళ్ళి బ్రతిమాలుకోవాలనడం అవివేకం. ఇద్దరూ ఒక్కలాంటివాళ్లే. వీళ్లస్థాయి, వాళ్లస్థాయి ఒక్కటే."

"నీ కూతురికే పెళ్ళికాదు—"

"పోనీ దానికి ఎల్లా నచ్చితే అల్లా చేస్తుంది."

"అందుకు లోకం అంగీకరించదు—"

"లోకంతో నిమిత్త మేమిటోయ్? కాని రంకుతనంకాదు గదటోయ్—"

"వస్తా మరి—"

"వెళ్లు—"

గుమ్మందిగిపోయాడు రవణయ్యపంతులు.

* * *

దశరా శెలవలకి ఇంటికివచ్చాడు రామచంద్రం. రాగానే పెళ్ళి వూసు యెవరైనా ఎత్తుతారేమోనని ఆశపడ్డాడు. అనుకున్నట్టుగానే సుందరామయ్యగారు అన్నారు.

"వాళ్లు మరి రాలేదురా—" అని.

రామచంద్రం నిర్వెరపోయాడు. పిల్ల యిష్టపడిందికదా, యెందుకురాలేదు.

"పోనీ మీరు వుత్తరం రాయకపోయారా?"

"మనం ముందు వుత్తరం రాయడం మంచిది కాదు—"

"ఏం?"

"వాళ్ళు మన యింటికి రావాలిగాని..."

"పోనీండినాన్నా-మనం ఇల్లాంటి పట్టుదలలు పెట్టుకోరాదు—"

"నీకేం తెల్సురా? మీ పెదమామయ్య కూతురి పెళ్లికి యెంత తాపత్రయపడ్డాడో నీకు తేలీదూ. వాళ్ళ యింటిచుట్టూ పదిసార్లన్నా తిరగేడు."

"ఆడపిల్లగలవాళ్లయినంత మాత్రాన తక్కువవాళ్ళయిపోయారా?"

"నీకు తెలీదు పోవోయ్—"

స్వతహాగా యెప్పుడూ తండ్రిమాటకి ఎదురుచెప్పి యెరగడు రామచంద్రం వూరుకున్నాడు మళ్ళీ ప్రశ్నించాడు.

"రవణయ్యపంతులు రాలేదా మరి?"

"వచ్చాడు—"

"ఏమన్నాడు?"

"మనం వాళ్ళయింటికి మళ్లీ వెళ్లాలన్నాడు."

"ఐతే మీరేమన్నారు—"

"అలా వీల్లేదన్నాను—"

కష్టమనిపించింది రామచంద్రానికి.

"వాళ్లు మరోసంబంధం చూసుకుంటున్నారట" మళ్ళీ అన్నాడు సుందరరామయ్య.

నిలువునా నీరయిపోయాడు రామచంద్రం అక్కణ్ణించి లేచిపోయాడు.

రామచంద్రం, ఎలాగన్నా చేసుకోవాలి సరోజనిని. అయితే ఎలా?

ఆలోచనతోపడ్డాడు. సాయంత్రం అయిపోయింది. అయిదుగంటలుకొట్టింది సైన్సుకాలేజీ గడియారం. యే నిర్ణయానికీ రాలేకపోయాడు

అసలు రవణయ్యపంతులు యేమిచెప్పాడో వాళ్ళతో? తను యిష్టపడినట్లు చెప్పలేదా? చెప్పినా, వాళ్ళు వూరుకున్నారా? ఆనాడు సరోజిని యిష్టపడినట్లు తనకి తెల్సుగా? కొంపతీసి తను యిష్టపడనట్లుగాని చెప్పాడా? నిజంగా ఆ పిల్లకి మరోసంబంధం స్థిరపడిందా?

యీ విషయాలు తనకి తప్పమరెవరికీ తెలీదింతవరకు. ఇప్పుడు యెవరితో చెప్పినా తనకి నగుబాటుకాకతప్పదు. పోనీ తను స్వయంగా వెళ్ళితే? యేం లాభం? ఆ పిల్లకి సంబంధం స్థిరపడిపోయిందేమో?

యేమైనా. తను రహస్యంగా కనుక్కోవాలి రెండురోజులు ఆలోచించాడు. తుదకు తను వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

తనకి గుర్తుకొచ్చింది ఓ విషయం. వాళ్ళింటి నౌఖరు తనతో స్టేషనుదాకా వచ్చాడు. ఎంతో మంచివాడుగా అవుపించాడు వాడు యెలాగయినా తనకి సహాయంచేయగలడు.

* * *

రైలు దిగాడు. ఎక్కడవుండటం? ఎలా కల్సుకోవడం వాళ్ళ నౌఖరుని? ఆలోచించాడు. ఏదో ఆలోచన మెరిసింది బుర్రలో.

నాలుగ్గంటలన్నర అయింది. యింకా గంట కాలం దాటితేగాని తెల్లారదు. ఈలోగా ఏదో హోటల్లోకిపోయి స్నానంచేసుకుని, డ్రెస్ వేసుకుని, బయటికి రావచ్చునని నిశ్చయించాడు.

ఏడున్నర దాటిపోయింది. కాబోయే అత్తారింటికి కాస్తదూరంలో వున్నది, తనుదిగిన హోటలు. బయటకొచ్చి నిలబడ్డాడు. అప్పుడే అరగంటగడిచిపోయింది. యింకా నౌఖరు కనబడలేదు. అలా చూస్తూవుండిపోయాడు వాళ్ళ యింటివేపు.

ఇంతలో వాళ్ళ నౌఖరు అప్పలస్వామి—తనకి బాగా గుర్తుంది ఆ పేరు. సంచీపట్టుకుని కూరలకోసం వస్తున్నాడు. ఆఫీసులో పనిచేస్తూయి టిదగ్గర కూడా అయ్యగారికి సేవచేస్తుంటానని ఆనాడు చెప్పినందుకూ, యిప్పుడు చేస్తున్న పనికీ సరిపోయింది. ఆవేళ, చుట్టాలు వచ్చారని, వచ్చివుంటాడని అనుకున్నాడు రామచంద్రం.

దగ్గిరపడ్డాడు అప్పలస్వామి, వాడే పలకరించాడు.

"ఏంబాబూ యెప్పుడు రావటం? యిక్కడనుంచున్నారేం, యింటికి రండిబాబూ."

"వేరే పనిమీద వచ్చాను, అనక వద్దామనుకున్నాను."

"బాబూ మీకోసం మా సరోజినమ్మగోరు" మధ్యలో ఆగిపోయాడు అప్పలస్వామి.

"చెప్పడేం" తొందరపడ్డాడు రామచంద్రం.

"అయితే నువ్వనేదేమిటి?" అందామనుకున్నాడు. యింతలో వాడే అందుకున్నాడు మళ్ళీ—"మీరెప్పుడొస్తారా అని చూస్తున్నారు మీ నాయనగారు వుత్తరం రాస్తారని, రవణయ్యగారు చెప్పినారట."

యదార్థం బయటపడినందుకు సంతోషించాడు రామచంద్రం.

"యేదో"సంబంధం కైటయిందని విన్నాను?

"అలాగే జరగవలసింది బాబూ. రవణయ్యగారు యేటన్నారంటే, పదిహేను రోజుల్లో వుత్తరం రాకపోతే, మరి చూడొద్దొన్నారు. రెండునెల్లు గడిచిపోయినా రాలేదని, చెన్నపట్నంనుండి వచ్చిన సంబంధాన్ని స్థిరపరచబోయారు, కాని అమ్మగారు యిష్టంపడలేదు."

తృప్తిపడ్డాడు రామచంద్రం.

"రాండి బాబూ" అంటూ అప్పలస్వామి ముందు నడిచాడు. అనుసరించాడు రామచంద్రం.

రామచంద్రాన్ని కిటికీలోంచి చూచి సంబరపడిపోయింది సరోజిని. తను అత్యున్నత శిఖరాల్నందుకున్నట్టు ఫీలయింది.

గుమ్మంలో అడుగు పెట్టాడేగాని, ఏమని జవాబు వస్తుందోనని అనుమానం పట్టుకుంది. కాకపోయినా తనవాళ్లెవరికీ తెలియకుండా తను యిక్కడికి రావడం ఏమంత మంచి పనికాదనిపించింది. గోపాలంగారు యివతలికొచ్చి రామచంద్రాన్ని లోపలికి తీసుకెళ్ళాడు.

"అయితే రవణయ్యపంతులు మీతో యేమీ చెప్పలేదా?"అడిగాడు రామచంద్రం, ధైర్యంచేసి.

తెల్లపోయి చూచాడు గోపాలంగారు రామచంద్రంవేపు. ఆదేం అలా అడుగుతున్నా వన్నట్టుగా ముఖంపెట్టాడు. అన్నాడు. "మీరు వుత్తరం రాస్తామన్నారని అన్నాడు."

"మీరు వుత్తరం రాస్తారనీ, లేకపోతే మా యింటికి వస్తారనీ నాతోటీ, మావాళ్ళతోటీ చెప్పారు" అన్నాడు రామచంద్రం.

యథార్థాలు బయటపడిపోయాయి. సరోజిని ముఖం విప్పారింది.

గోపాలంగారు అన్నారు. "ఈ సాయింత్రం వెళతాను మీ వూరు—"

రామచంద్రం ఉప్పొంగిపోయాడు.

పెళ్ళికి రాలేదు సరికదా, నేటికీ అగుపించలేదు రవణయ్యపంతులు.

---

రాజుగారి పట్టపుటేనుగూ, రాణీగారి పెంపుడు పిల్లీ—కలిసి రోడ్డుమీద నడుస్తున్నాయి. దారిలో ఓ వంతెన తగిలింది. నిశ్శబ్దంగా రెండూ వంతెన దాటేశాక పిల్లి ఏనుగుతో అంది: "మొత్తంమీద యిద్దరంకలిసి వంతెనని ఒక ఊపు ఊపేశాం!"

** ** ** **

గాలిలో మేడలు కట్టుకుంటూ కాలక్షేపం చెయ్యడం ఫరవాలేదుగాని, ఆ మేడలోకి కాపురం మార్చడానికి ప్రయత్నిస్తేమట్టుకు చిక్కే!